## నేడు పరిగి మండల సర్వసభ్య సమావేశం

పరిగి, ఏప్రిల్ 1: పరిగి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఎంపీపీ కరణం అరవిందరావు అధ్యక్షతన మంగళవారం ఉదయం 11 గంటలకు పరిగి మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశపు హాలులో జరిగే మండల సర్వసభ్య సమావేశానికి వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

## తైబజారు డబ్బులు చెల్లించరాదు

పరిగి, ఏప్రిల్ 1: పరిగి పట్టణంలో తైబజార్ వసూలు చేసే కాల పరిమితి పూర్తయినందున వ్యాపారస్తులు తైబజారు డబ్బులు చెల్లించరాదని పరిగి మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి 31వ తేదీతో తైబజార్ వసూలు చేసే కాలపరిమితి ముగిసిందని తెలిపారు. అందువల్ల పట్టణంలోని వ్యాపారస్తులు, చిరు వ్యాపారస్తులు తైబజారు డబ్బులు ఎవరికి చెల్లించరాదన్నారు. ఎవరైనా డబ్బుల వసూలుకు వస్తే మున్సిపల్ కార్యాలయంలో తెలియజేయాలని ఆయన కోరారు.

## నేడు పాపన్నగౌడ్ వర్ధంతి..

కులకచర్ల, ఏప్రిల్ 1: మండల కేంద్రంలోని బస్టాండు దగ్గరలో మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కులకచర్ల మండల గౌడ సంఘం అధ్యక్షుడు మాలె కృష్ణయ్యగౌడ్ తెలిపారు. ఉదయం 9గంటలకు పాపన్నగౌడ్ విగ్రహం దగ్గర నిర్వహించే కార్యక్రమానికి గౌడ సంఘాల నాయకులు, సభ్యులు, ప్రజాప్రతినిధులు, గ్రామాల ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## 7న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

కులకచర్ల, ఏప్రిల్ 1 : ఈ నెల 7న మోడల్ స్కూల్ ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు ముజాహిద్‌పూర్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి తెలిపారు. 6వ తరగతి ప్రవేశం కోసం ఉదయం 10 నుంచి 12గంటల వరకు, 7నుంచి 10వ తరగతి వరకు మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ప్రరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని అన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మర్పల్లి, ఏప్రిల్ 1 : మండలంలోని పట్లూర్ గ్రామానికి చెందిన బేగరి పద్మమ్మ అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. ఎస్కేఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి రూ. ఐదు వేలు పంపగా సోమవారం ఎంపీటీసీ స్వప్న సురేశ్ బాధిత కుటుంబానికి అందజేశారు.. ఈ కార్యక్రమంలో మోహన్, నిరంజన్, శ్రీకాంత్, రాజు, దిలీప్ పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సివిల్ సప్లయ్ డీఎం సుగుణాబాయి, డీఎస్‌వో రాజేశ్వరి

కులకచర్ల, ఏప్రిల్ 1 : ఐకేపీ ధ్యానం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సివిల్ సప్లయ్ డీఎం సుగుణాబాయి, డీఎస్‌వో రాజశ్వేరి అన్నారు. సోమవారం కులకచర్ల మండల కేంద్రంలోని సరస్వతీ శిశుమందిర్‌లో ఏర్పాటు చేసిన ఐకేపీ ధ్యానం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మకుండా నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలన్నారు. క్వింటాలుకు ఏ గ్రేడ్ ధాన్యం రూ. 2203, బీ గ్రేడ్ ధాన్యం రూ. 2183 రేటును నిర్ణయించిందన్నారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకొని నాణ్యతగా కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని అన్నారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని సక్రమంగా కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఎలాంటి అవకతవకలు జరుగకుండా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు కొనుగోలు చేసిన ధాన్యానికి ఓపీఎంఎస్ చేసి డబ్బులు వచ్చే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కులకచర్ల ఎంపీడీవో రామకృష్ణనాయక్, డీపీఎం రామ్మూర్తి, ఏపీఎం శోభ, సీసీ వెంకటయ్య, వీవోఏలు, గ్రామ సంఘం అధ్యక్షులు, రైతులు పాల్గొన్నారు.

## స్పీకర్ ఆధ్వర్యంలో ఇఫ్తారు విందు..



ఇఫ్తార్ విందులో పాల్గొన్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, పాల్గొన్న ముస్లింలు

వికారాబాద్, ఏప్రిల్ 1 : వికారాబాద్ పట్టణంలోని చిగుళ్లపల్లి గ్రౌండ్స్‌లో సోమవారం సాయంత్రం తెలంగాణ శాసనసభ సభాపతి, వికారాబాద్ శాసనసభ్యుడు గడ్డం ప్రసాద్ కుమార్ ఆధ్వర్యంలో నియోజకవర్గ ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. అన్ని మండలాలు, గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ముస్లింలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నవాబ్ మహమూద్ ఆలం ఖాన్, ముజాహిద్ ఆలం ఖాన్, మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ అజమతుల్లా ఖాన్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఫహీం భాయ్, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, నాయకులు సుధాకర్ రెడ్డి, కిషన్ నాయక్, వహీద్, వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారమేశ్, నాయకులు అయూబ్ అన్సారీ, ముక్తార్ షరీఫ్, వెంకట్ రెడ్డి, పరుశరామ్ నాయక్, శ్రీనివాస్ ముదిరాజ్, రఘుపతి రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, అసిఫ్, సర్ఫరాజ్, జాఫర్, కరీం, రహీం తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి కొరత రాకుండా చూడాలి

### వికారాబాద్ మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ చంద్రకళ




సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చంద్రకళ

వికారాబాద్, ఏప్రిల్ 1 : వికారాబాద్ మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీడీవో కార్యాలయంలోని రవీంద్ర మండపంలో ఎంపీపీ చంద్రకళ అధ్యక్షతన జరిగింది. మండలంలోని అన్ని గ్రామాల్లో వంద శాతం పన్నులు వసూలు చేసినట్లు ఎంపీవో సమావేశంలో వివరించారు. గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలను మండల కో ఆప్షన్ సభ్యుడు జాఫర్ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ చంద్రకళ మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించేందుకు మండల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు శ్రద్ధ చూపించాలన్నారు. పారిశుధ్యం పై దృష్టి పెట్టి మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. తాగునీటి కొరత రాకుండా ముందస్తుగా బోర్లు, చేతి పంపులను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు తెలిపారు. ఆయా శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సర్వసభ్య సమావేశానికి ఆయా శాఖల అధికారులు డుమ్మా కొట్టడం పై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ ఎంపీడీవో వినయ్ కుమార్, సూపరింటెండెంట్ చెన్నారెడ్డి, ఎంపీటీసీ గౌస్, ఎంఈవో బాబుసింగ్, ఎంపీవో నాగరాజు, ఏపీఎం శ్రీనివాస్, ఏవో జ్యోతి, ఉద్యానవన శాఖ అధికారి అర్చన, సీడీపీవో వెంకటేశ్వరమ్మ, ఏపీఎం లక్ష్మయ్య, పంచాయతీరాజ్ ఏఈ చాణక్య, ఆయా శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

## పాంబండపై ఘనంగా శకటోత్సవం



కులకచర్ల, ఏప్రిల్ 1 : మండల పరిధిలోని బండవెల్కిచర్ల శ్రీ పాంబండ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం శకటోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు తమ ఎడ్ల బండ్లను అలంకరించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు హాజరయ్యారు.

## రంజాన్ కిట్ల పంపిణీ



వికారాబాద్, ఏప్రిల్ 1 :వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని శివారెడ్డిపేటలో నిరుపేద ముస్లింలు 1400 మందికి సోమవారం ప్రముఖ వ్యాపారవేత్త సయ్యద్ ఇక్బాల్ రంజాన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కిట్లలో రంజాన్ పండుగకు కావల్సిన నిత్యావసరాలు ఉన్నాయని, 30 మందికి సరిపడా వస్తువులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

# కాంగ్రెస్‌కు బీసీల సత్తా చూపుతాం

**పార్లమెంట్ ఎన్నికల్లో రెడ్డి సామాజిక వర్గానికే అధిక సీట్లు**

- బీసీ సామాజిక వర్గాన్ని విస్మరిస్తున్న కాంగ్రెస్‌కు బుద్ధిచెబుతాం
- 7న బీసీల రాజకీయ విస్తృత స్థాయి సమావేశం
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్....

కవాడిగూడ, ఏప్రిల్ 1 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాపాలన పేరుతో కులపాలన కొనసాగిస్తున్నదని, అన్ని రకాల పదవులను రెడ్డి సామాజిక వర్గానికి కల్పిస్తూ బీసీ సామాజిక వర్గాన్ని విస్మరిస్తున్నదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. సోమవారం దోమలగూడలోని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యాలయంలో జరిగిన బీసీ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు సగం పార్లమెంట్ స్థానాలను బీసీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీసీల సత్తా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. బీజేపీ 17 పార్లమెంట్ స్థానాల్లో బీసీలకు 5, బీఆర్ఎస్ 6 టికెట్లు కేటాయిస్తే కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు 13 మంది అభ్యర్థులను ప్రకటిస్తే అందులో బీసీలకు కేవలం 3 టికెట్లు మాత్రమే ప్రకటించిందని, ఇది అత్యంత దారుణమని మండిపడ్డారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా బీసీల రాజకీయ భవిష్యత్తుపై చర్చించి రాజకీయ కార్యాచరణ రూపొందించడానికి, బీసీల విధివిధానాలపై చర్చించడానికి ఈ నెల 7వ తేదీన హైదరాబాద్‌లోని వందలాది మంది బీసీ సంఘాల ప్రతినిధులతో బీసీల రాజకీయ విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేశా చారి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రం గౌడ్, బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి.మని మంజరి సాగర్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొడుగు మహేశ్‌యాదవ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్, నాయకులు సమతాయాదవ్, ఇంద్రం రజక, మహేశ్ మేరు, తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి

బొంరాస్‌పేట, ఏప్రిల్ 1 : ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల అన్ని రకాల బిల్లులను చెల్లించాలని విద్యా వంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్, నాయకుడు గౌరారం గోపాల్ టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాంకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు వివిధ వ్యక్తిగత, ఆరోగ్య అవసరాల కోసం జీపీఎఫ్, జీఎల్ఐ రుణాల కోసం దరఖాస్తు చేసుకుని ఏడాది దాటినా బిల్లులు చెల్లించలేదని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వీటిని చెల్లించేలా చూడాలని వారు కోరారు. పీఆర్సీ బాకాయిలు, సరెండర్ సెలవుల బకాయిలు విడుదల చేయాలని, గతంలో ఎస్సెస్సీ స్పాట్ విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు వెంటనే డబ్బులు చెల్లించాలని కోరారు. ఎయిడెడ్ ఉపాధ్యాయులు, సమగ్ర శిక్షలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రతినెలా ఒకటవ తేదీన వేతనాలు చెల్లించాలని వారు కోరారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను ఏప్రిల్ 23న రిలీవ్ చేయాలని, విద్యా సంవత్సరం ప్రారం భం నాటికల్లా ప్రతి పాఠశాలలో పారిశుద్ధ్య కార్మికులను నియ మించాలని, ఖాళీగా ఉన్న పోస్టులలో విద్యా వలంటీర్లను నియమిం చాలని, విద్యార్థుల నమోదుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు.

## కాంగ్రెస్ హయాంలో నీటి సమస్యలు షురూ..



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి

యాలాల, ఏప్రిల్1: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తాగు, సాగునీటి సమస్యలు ప్రారంభమయ్యాయని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి అన్నారు. సోమవారం యాలాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొడంగల్‌కు తాగు నీరు అందించాలనే ఉద్దేశంతో తాండూరు కాగ్నా నది నుంచి గత ప్రభుత్వ హయాంలో ఓ పథకం ప్రారంభించినట్లు తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ పథకం వల్ల తాగు నీటి సమస్యలు తలెత్తలేదన్నారు. తాండూరు ప్రాంత వనరులను తాండూరుకు చెందకుండా ఇతర ప్రాంతాలకు తరలించడం ఎంత వరకు న్యాయమన్నారు. నీటి విషయంలో యాలాల మండలానికి జరుగుతున్న అన్యాయాన్ని ఖండిస్తున్నామన్నారు.ఈ సమావేశంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ వడ్డె రాములు, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లారెడ్డి, రైతు కమిటీ అధ్యక్షుడు అరవింద్ కుమార్‌రెడ్డి, మండల సెక్రటరీ కృష్ణ, అక్కంపల్లి సర్పంచ్ లక్ష్మీనారాయణ, బండమీది పల్లి సర్పంచ్ లక్ష్మణ్, సీనియర్ నాయకులు మాజీ ఎంపీటీసీ వెంకట గౌడ్, సీనియర్ నాయకులు శివకుమార్, అక్కంపల్లి నారాయణ, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

యాలాల, ఏప్రిల్1: తాండూరు పట్టణం రహమత్ నగర్‌కు చెందిన యూనస్(45) అనే వ్యక్తి డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. పట్టణంలోని విలియంమూన్ చౌరస్తా వద్ద గంజాయి విక్రయిస్తుండగా సీఐ సంతోష్ కుమార్ ఎస్ఐ కాశీనాథ్ అరెస్ట్ చేశారు. రూ.50 వేల విలువ గల 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాం డ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ సంతోష్ కుమార్ తెలిపారు.



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న నగదును మీడియాకు చూపిస్తున్న రైల్వే పోలీసులు

## సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో.. రూ.37,50,000 నగదు పట్టివేత..

మారేడ్‌పల్లి, ఏప్రిల్ 1: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జీఆర్పీ పోలీసులు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో చేపట్టిన తనిఖీల్లో ఓ వ్యక్తి వద్ద రూ. 37,50,000 నగదు పట్టుబడింది. సికింద్రాబాద్ రైల్వే ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ కథనం ప్రకారం.. తమిళనాడుకు చెందిన పి. లక్ష్మణ్ రామ్ ఆదివారం రైలులో వచ్చి.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో దిగాడు. ఫ్లాట్ ఫారం నంబర్-1 నుంచి బ్యాగ్‌తో వస్తున్న లక్ష్మణ్‌రామ్‌ను రైల్వే పోలీసులు తనిఖీలు చేశారు. అతడి వద్ద ఉన్న బ్యాగ్‌లో ఉన్న రూ.37,50,000 నగదు బయటపడింది. ఈ నగదుకు సంబంధించిన ఎలాంటి పత్రాలు లేకపోవడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదును ఐటీ శాఖకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. రైళ్లలో నగదు, బంగారం, వెండి ఆభరణాలు రవాణా చేసే సమయంలో సరైన పత్రాలతో తీసుకెళ్లాలని రైల్వే పోలీసులు సూచించారు.

## వడదెబ్బతో.. ఒకరి మృతి

కాచిగూడ,ఏప్రిల్ 1: వడదెబ్బతో గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ ఎస్సై పి.రవికుమార్ కథనం ప్రకారం.. కాచిగూడ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని (50) ఓ వ్యక్తి వడ దెబ్బతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని.. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖాన మార్చురీకి తరలించారు. మృతుడి ఒంటిపై గోధుమ రంగు చొక్కా, కాకి రంగు ప్యాంట్ ఉన్నదని తెలిపారు. వివరాల కోసం 8712660543లో సంప్రదించాలని ఎస్సై కోరారు.

## చెరువు నీటి తరలింపును నిలిపివేయాలి

దోమ, ఏప్రిల్ 1: గుండాల గ్రామ సమీపంలోని ఎలియకుంట చెరువు లోని నీటిని ఇదే గ్రామానికి చెందిన కొందరు బోరు మోటర్లు బిగించి అక్రమంగా పంట పొలాలకు తరలిస్తున్నారని ఇరిగేషన్ , రెవెన్యూ అధి కారులకు ఎన్ని ఫిర్యాదులు ఇచ్చినా చర్యలు తీసుకోలేదని గ్రామ స్తు లు మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. నీటి తరలింపు కారణంగా చెరువులో నీరు అడుగంటి పోయి పశువులకు సైతం తాగు నీటికి కష్టా లు వచ్చే అవకాశం ఉందని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నీటి తరలింపును నిలుపుదల చేసి తమకు న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## గిరిజన గురుకులాలకు దరఖాస్తుల ఆహ్వానం

వ్యవసాయ యూనివర్సిటీ, ఏప్రిల్ 1 : తెలంగాణ రాష్ట్ర గురుకులాల ఆధ్వర్యంలో గిరిజన విద్యార్థులకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని సైనిక్ స్కూల్లో 2024-25 ప్రవేశానికి రాష్ట్ర వ్యాప్తంగా 6వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి నిర్వహించే ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 7న ఆదివారం ప్రవేశ పరీక్ష ఉంటుందని, వివరాలకు www.tgtugurukulam. telangana.gev.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

## సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణ

కాచిగూడ, ఏప్రిల్ 1 : కేంద్ర ప్రభుత్వ అమోదిత నేషనల్ అకాడమి ఆఫ్ సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్ కోర్సుల్లో ఆన్‌లైన్‌లో శిక్షణకు తెలంగాణ వ్యాప్తంగా ఆసక్తి గల యువతి, యువకుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు సంస్థ డైరెక్టర్ విమలారెడ్డి తెలిపారు. సోమవారం కాచిగూడలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్నారు. సెక్యూరిటీ ఆర్కిటెక్ట్, ఐటీ సెక్యూరిటీ విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీర్, పాలిటెక్నిక్, డిప్లొమా విద్యార్థులు ఈ నెల 15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 7893141797, ఆన్‌లైన్‌లో www.nacsindia.org లో సంప్రదించవచ్చన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం

బషీరాబాద్, ఏప్రిల్ 1: మండల పరిషత్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా విధులు నిర్వహిస్తున్న జలీల్ పాషా అనారోగ్యంతో సోమ వారం మృతి చెందాడు. మండల పరిషత్ కార్యాలయ అధికారులు ఎంపీవో రమేశ్, సూపరింటెండెంట్ విజయ కుమారి, జూనియర్ అసి స్టెంట్ షేర్‌ఖాన్ మృతుడి గ్రామం గౌతాపూర్ కు వెళ్లి అంత్యక్రియల నిమిత్తం రూ. 20 వేలు అందించారు. జలీల్ పాషా మృతి పట్ల ఎంపీడీవో రాఘవులు, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

## వివిధ లా కోర్సుల పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 1 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని మూడేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్ఎల్‌బీ కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 18వ తేదీ నుంచి, ఎల్ఎల్ఎం మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 23వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఓయూ అధికారులు చెప్పారు.


### లా కోర్సుల పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని లా కోర్సుల పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ అధికారులు తెలిపారు. ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్‌బీ ఆనర్స్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్ఎల్‌బీ కోర్సుల మూడు, అయిదు, ఏడు, తొమ్మిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను ఈ నెల 15వ తేదీ తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రివాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.700 చొప్పున చెల్లించి, ఈ నెల 16వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 30వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### డిగ్రీ కోర్సుల రివాల్యుయేషన్ ఫలితాలు విడుదల

బీఏ, బీబీఏ, బీకామ్, బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్ తదితర కోర్సుల మొదటి, మూడో, అయిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల రివాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు.

## జిల్లా కోర్టు నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



నూతన అధ్యక్ష కార్యదర్శులను సన్మానిస్తున్న న్యాయవాదులు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా కోర్టులో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం జిల్లా కోర్టుల ప్రాంగణంలో జరిగింది. ఎన్నికల రిటర్నింగ్ అధికారి గుర్రం సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు వై.కొండల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గులగారి కృష్ణ, ఉపాధ్యక్షుడు పి.రాజేందర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి రాధాకృష్ణ, మహిళా కార్యదర్శి మీనాక్షి, కోశాధికారి కెరెత్ కుమారి, గ్రంథాలయ కార్యదర్శి రాములు, క్రీడా కార్యదర్శి అశోక్‌తో పాటు కార్యవర్గ సభ్యులు విజయ్ చంద్రకిరణ్, వంశీకృష్ణ, ప్రవీణ్‌కుమార్, రవి, సందీప్, శైలజ, స్వప్న ప్రమాణాసీకారం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు కొంగర రాజిరెడ్డి, బార్ కౌన్సిల్ సభ్యులు దన్వాడ మధుసూదన్‌రావు, ఎంపీ భార్గవ్, గోకుల్ రామారావు, ఫుడ్ కమిషన్ సభ్యులు కొంతం గోవర్ధన్ రెడ్డి, మాజీ పంచాయతీరాజ్ కమిషన్ సభ్యులు పులిగారి గోవర్ధన్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్ బాచి రెడ్డి సాయిరెడ్డి, న్యాయవాద జేఏసీ నాయకులు మంత్రి రవీందర్‌రావు, పీఠం ప్రదీప్‌కుమార్, నర్సింగోజు నరేశ్ కుమార్, లింగం, జొన్నాడ రాకేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో పడి వృద్ధుడు గల్లంతు

వికారాబాద్, ఏప్రిల్ 1: చెరువులో పడి వృద్ధుడు గల్లంతైన ఘటన వికారాబాద్ మండలం ఎర్రవల్లి గ్రామంలో సోమవారం చోటు చేసు కుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్కల అనంతయ్య (60) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారు. సోమవారం మధ్యాహ్నం అదే గ్రామంలోని చెరువులో చేపల వేట కోసం వెళ్లాడు. చేపలు పట్టిన అనంతరం ఒడ్డుకు వచ్చిన అనంతయ్య మళ్లీ చెరు వులోకి దిగి ఈత కొట్టాడు. చెరువులో ఈత కొడుతూ ఊపిరి ఆడక నీటిలో మునిగిపోయాడు. గమనించిన గ్రామస్తులు వెంటనే కాపాడే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకపోయింది. దీంతో పోలీసులకు సమాచారం అందించగా, పోలీసులు, ఫైర్ సిబ్బంది చెరువులో గాలిం పు చర్యలు చేపట్టారు. కోట్‌పల్లి నుంచి బోట్ తెప్పించడంతో పాటు గజ ఈత గాళ్లను రంగంలోకి దింపినా ఆచూకీ లభించలేదు.

**PUBLIC NOTICE**

It is hereby informed that my client Sri. Govula Mahesh, R/o. Hyderabad, has entered into an agreement of sale to purchase all that property i.e., Open Plot No.189, In the HMDA Layout "NATURA", L.P. No.40/LO/PLG/ HMDA/ 2015 in Sy. No's. 193/P, 194/P & 200/P admeasuring 150.0Sq.yds or 125.41 Sq.Mts. Situated at THIMMAPUR VILLAGE & G.P., Kothur Mandal, Ranga Reddy District, (now part of Mahaboobnagar Dist.,) bounded by NORTH: P.No.188, SOUTH: P.No. 190, EAST: P.No.199 and 200 WEST: Road from Smt. Gadireddy Mani. Saroja W/o. Sri.G.Pottaiah Naidu, R/o H.No.4-9-732, Lecturers colony,Hayath Nagar, Ranga Reddy District, Telangana.
If any Banks, Financial Institutions, persons, private sectors has got any objection against the said transaction they may put forth their objections before the undersigned along with the documentary proof within 10 days from the date of publication of this notice. If objections are not received, my client will finalise the deal and the objections raised thereafter will not be entertained.

Sd/- **P. V. S. Sagar,** Advocate,
Office: Plot # 18, Sai Enclave,
Roadnol2, Banjara Hills, Hyd-34,
Telangana, Phone: 9619666696